# రైస్ మిల్లర్ల దందాపై చర్యలు తీసుకోవాలి

**శెనార్తి మీడియా, చొప్పదండి:**



చొప్పదండి, మానకొండూరు ప్రాంతాల్లో కొందరు రైస్ మిల్లర్లు రైతులను మోసం చేస్తూ అదనపు తూకం పేరుతో దోపిడీ చేస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు 5 కేజీల తరుగు పేరుతో 41 కిలోల బదులుగా 43 కిలోల బ్యాగులు తూకం వేయిస్తున్నప్పటికీ, లారీకి పది క్వింటాళ్లు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధాన్యం దిగుమతి చేసుకోకపోవడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత రైస్ మిల్లర్లను బ్లాక్‌లిస్టు చేయడంతో పాటు గోదాములలోని బ్యాగులను తనిఖీ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ చొప్పదండి పట్టణ అధ్యక్షుడు చిల్లా శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కలిసి చొప్పదండి తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... సివిల్ సప్లైస్ అధికారులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కవడం వల్లే దోపిడీ పెచ్చరిల్లిందని కృష్ణారెడ్డి ఆరోపించారు. తరుగు పేరుతో అదనపు తూకం వేసిన ఏ రైస్ మిల్లర్‌పై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం దీనికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. పది రోజులుగా చొప్పదండి మండలం నుంచి రైస్ మిల్లులకు వెళ్తున్న ధాన్యంపై వరుసగా పేజీలు పెడుతున్నప్పటికీ అధికారులు కనీసం స్పందించకపోవడం ఆశ్చర్యమన్నారు. రైతులు ధర్నా చేసినా కూడా చర్యలు తీసుకోకపోవడం ఎందుకని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్ల దోపిడీని ఇప్పటికైనా అరికట్టకపోతే రైతుల ప్రత్యక్ష ఆందోళనలు తప్పవని సింగిరెడ్డి కృష్ణారెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు బత్తిని ప్రశాంత్ గౌడ్, చల్లా అనూష్ పటేల్, గుండేటి శివ, వడ్లూరి సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


### మెడికల్ కాలేజీకి రెండు బస్సుల కోసం

# ₹80 లక్షలు మంజూరు చేయండి

### మంచిర్యాల కలెక్టర్‌కు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ విజ్ఞప్తి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల మెడికల్ కాలేజీ విద్యార్థులు, ఇంటర్న్స్, అధ్యాపక సిబ్బందికి రవాణా సదుపాయాలను మెరుగుపరచేందుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కీలక చర్యలు చేపట్టారు. కాలేజీకి అత్యవసరంగా రెండు బస్సులు అవసరమన్న విషయంపై ఎంపీ జిల్లా కలెక్టర్‌కు అధికారిక లేఖ సమర్పించారు.ఎంపీ వివరాల ప్రకారం... ఒక్క బస్సు అంచనా వ్యయం ₹40 లక్షలు కాగా, రెండు బస్సుల కొనుగోలుకు మొత్తం ₹80 లక్షలు అవసరమని, ఈ మొత్తాన్ని ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి మంజూరు చేయాలని కోరారు. విద్యార్థుల రోజువారీ రవాణా, క్లినికల్ పోస్టింగ్స్, గ్రామీణ వైద్య శిబిరాలు, మెడికల్ అవుట్‌రిచ్ కార్యక్రమాలకు ఈ బస్సులు కీలకమని ఎంపీ తెలిపారు. అత్యవసర ఆరోగ్య ప్రతిస్పందనలో కూడా ఇవి సహాయపడతాయని అన్నారు.మెడికల్ కాలేజీ అభివృద్ధి, శిక్షణ ప్రమాణాల పెంపు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణలో ఈ బస్సులు అత్యంత అవసరమని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఆలస్యం చేయకుండా ఎంపీ ల్యాడ్స్ నిధుల మంజూరు ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్‌ను కోరారు.


VAMSI KRISHNA GADDAM
MEMBER OF PARLIAMENT
LOK SABHA

To,
The District Collector,
Mancherial District,
Telangana.

Subject: Request for sanction of ₹80 lakhs from MPLADS funds for procurement of 2 buses for Mancherial Medical College.

Respected Sir,

Office of the District Collector





# తెలంగాణ తల్లి.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక




**శెనార్తి మీడియా, మంచిర్యాల(నస్పూర్):**

తెలంగాణ సంస్కృతికి నిదర్శనం తెలంగాణ తల్లేనని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డకు విశిష్ట స్థానం ఉందని, మహిళను ఇంటి దేవతగా భావించే ఆనవాయితీ కొనసాగుతున్నదని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార రంగాల్లో మహిళలు ముందుకు సాగేందుకు సహకరిస్తున్నట్టు చెప్పారు. కుటుంబానికి యజమానిగా మహిళ పేరుతో రేషన్ కార్డులు, గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు. తెలంగాణ సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు





# రామగుండం కమిషనరేట్ లో సెక్షన్ 163 అమలు

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**శెనార్తి మీడియా, మంచిర్యాల/ రామగుండం:**



గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలు డిసెంబర్ 11న జరగనున్న నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ లో సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమల్లోకి వస్తుందని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జోన్‌లోని కాల్వ శ్రీరాంపూర్, కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం, మంచిర్యాల జోన్ పరిధిలోని దండేపల్లి, జన్నారం, లక్షెట్టిపేట మండలాల్లో డిసెంబర్ 9 సాయంత్రం 5 గంటల నుండి ఫలితాలు ప్రకటించే వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమయంలో నలుగురికి మించి గుంపులు ఏర్పాటు చేయడం, ఉద్రిక్తతలను రేకెత్తించే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారితీసే ప్రవర్తన పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎలాంటి అసాంఘిక చర్యలు చోటుచేసుకున్న వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, ఫారెస్ట్ అధికారులు, కేంద్ర బలగాలు, హోమ్‌గార్డులు, ఎస్పీఓలకు ఈ నిషేధాలు వర్తించవని కమిషనర్ పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ఒక కిలోమీటర్ పరిధిలో కర్రలు, కత్తులు, తుపాకులు వంటి మారణాయుధాలతో సంచరించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. షామియానాలు, పందిళ్లు వంటి తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేయడానికి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మైకులు, లౌడ్‌స్పీకర్ల ద్వారా పాటలు ప్రసారం చేయడం, సభలు నిర్వహించడం, ప్రజల్లో విభేదాలు రేకెత్తించే ప్రసంగాలు చేయడం నిషేధమని తెలిపారు. ఎన్నికల సమయంలో చట్టబద్ధ అధికారాన్ని ధిక్కరించే విధంగా ప్రకటనలు, గుర్తులు, ప్లకార్డులు ప్రదర్శించడం కూడా చట్టవ్యతిరేకమని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.

# మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు సమగ్ర ఏర్పాట్లు

**శెనార్తి మీడియా, మంచిర్యాల/ హైదరాబాద్:**




ఈ నెల 11న జరగనున్న 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె ఏర్పాట్లను సమీక్షించారు. మొదటి విడతలో 3,834 గ్రామపంచాయతీల సర్పంచ్, 27,628 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని, 37, 562 పోలింగ్ కేంద్రాల్లో 56,19, 430 మంది ఓటర్లు ఓటు వేయనున్నారని కమిషనర్ తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు లేకుండా నిర్వహించాలని సూచించారు. జిల్లాలలో సిబ్బందికి శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ కౌంటర్లు, ఓటర్ స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా అధికారులు వెల్లడించారు. బందోబస్తు, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను కూడా పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ తర్వాత ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నట్టు సమావేశంలో పేర్కొన్నారు.కార్యక్రమంలో వ్యయ పరిశీలకులు రాజేశ్వర్, డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా అదనపు ఎన్నికల అధికారి, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గణపతి, నోడల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా కార్యవర్గం 2025–2028 కాలానికి ఎన్నికైన కొత్త కమిటీ మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి పరిచయం చేసుకుంది. సోమవారం రాత్రి వరకు కొనసాగిన బ్యాలెట్ పేపర్ ఎన్నికల అనంతరం ఏర్పడిన నూతన కార్యవర్గాన్ని కలెక్టర్‌కు పరిచయం చేసి సన్మానం చేశారు. అధ్యక్ష–కార్యదర్శులు ప్రస్తుత ఉద్యోగుల సమస్యలు, విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విన్నవించారు. అనంతరం జిల్లా ట్రెజరీ అధికారి ఎస్. రాజగోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య లను కలిసి విశ్రాంత ఉద్యోగుల సమస్య లను దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూ లంగా స్పందించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్ష–ప్రధాన కార్యదర్శులు దూస కృష్ణ, బెజ్జంకి జగన్, కోశాధికారి పి. పాపారావు, సహ అధ్యక్షులు కె. నాగే శ్వర్, ఉపాధ్యక్షులు బి. సత్యనారాయణ, బి. రాజమౌళి, కె. సంపూర్ణ, కార్యదర్శులు బి. శంకర్ గౌడ్, కె. వైకుంఠం, సంయుక్త కార్యదర్శులు ఎల్. ప్రేమ్‌రావు, కె. మల్లయ్య, నిర్వాహక కార్యదర్శులు పి. తిరుపతి, జె. కైలాసం, పి. సత్తమ్మ, బళ్ళ శంకర్లింగం, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ పాల్గొన్నారు.

# పీహెచ్‌సీల్లో డీఎంహెచ్ఓ తనిఖీ

- **వైద్య సేవల అమలుపై ఆరా**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మికంగా కుందారం, కోటపల్లి, వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య సేవల అమలు, ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గర్భిణల నమోదు, టీకాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అసంక్రమణ వ్యాధుల గుర్తింపు–చికిత్స, కీటక జనిత వ్యాధులు నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల్లో పాల్గొనే వైద్య సిబ్బంది, ఆశాలకు అవగాహన కల్పించి ఫస్ట్ఎయిడ్ కిట్లను అందజేశారు. కేంద్రాలలో నిర్వహణ, పర్యవేక్షణ చర్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీం నుండి ప్రశాంతి, డిపిఓ శ్రీనివాస్, సబ్మిట్ అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా మాస్ మీడియా అధికారి డాక్టర్ అరుణశ్రీ, ప్రోగ్రాం ఆఫీసర్ పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- **కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వ్యక్తులు, పార్టీల ప్రతినిధులపై చట్ట ప్రకారం కఠినమైన కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులకు కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. ప్రలోభాలు, బెదిరింపులు లేదా హింసాత్మక చర్యలకు పాల్పడే వారిపై ఏమాత్రం ఉపేక్ష చూపకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.ఎన్నికలు నిష్పాక్షికంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు కమీషనరేట్ పరిధిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతున్నదని తెలిపారు. నియమావళి ఉల్లంఘనలకు పాల్పడిన పలువురిపై ఇప్పటికే ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్టు కమీషనర్ వెల్లడించారు.

**చర్చిలో ప్రచారం...**

**సర్పంచ్ అభ్యర్థిపై కేసు**

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మతపర మైన ప్రదేశంలో ప్రచారం చేసిన సర్పంచ్ అభ్యర్థిపై గంగాధర మండలంలో కేసు నమోదు అయింది. గంగాధర తహసీల్దార్, ఎంసీసీ నోడల్ అధికారిగా అంబాటి రజిత చేసిన ఫిర్యాదు మేరకు డిసెంబర్ 7న పోలీసులు చర్యలు తీసుకున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో బరిలో ఉన్న చిరుత మంగ చర్చిలో సమావేశం నిర్వహించి, తన గుర్తు 'ఉంగరం' గుర్తుకు ఓటు వేయాలని కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆరాధనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం నిషేధించాలని ఉన్న నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ కేసు నమోదు చేశారు.నిందితురాలిపై దర్యాప్తు కొనసాగుతోంది.